పెద్దఅంబర్‌పేట : నోటు పుస్తకాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

చేవెళ్లరూరల్, జూన్ 14 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు వసతులను ఉపయోగించుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలారాణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆలూర్ జడ్పీ హెచ్ఎస్‌లో విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.శంకరయ్య, అమ్మన రావు, వీరప్ప, శారద, రజిని, ఎస్.విఠల్, అబ్దుల్లా, ఏఏపీసీ (అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్) సీహెచ్.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

ఇబ్రహీంపట్నంరూరల్ : విద్యార్థులు కష్టపడి చదవాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ అన్నారు. మండల పరిధిలోని పోచారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ ఇంద్రసేనారెడ్డితో పాటు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలూర్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు లీలారాణి, ఉపాధ్యాయులు

కడ్తాల్ : తలకొండపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఝాన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పెరుమాండ్ల లలిత పాల్గొని విద్యార్థులకు యూనిఫాం, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ రాములు, నర్సింహ, చెన్నమ్మ, మానస, సౌమ్య, నాయకుడు తిరుపతయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మంచాల : జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నోముల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌ను జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి అందజేశారు. ఆయన వెంట ఎంపీడీవో బాలశంకర్, ఎంపీటీసీ జయానందం, ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగప్ప, ఉపాధ్యాయులు బాలునాయక్, నవనీత, విజయ్‌కుమార్, బాల్‌రాజ్, ఐలయ్య ఉన్నారు.

పెద్దఅంబర్‌పేట : పెద్దఅంబర్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌన్సిలర్లు దండెం కృష్ణారెడ్డి, పసుల రాజేందర్ విద్యార్థులకు పుస్తకాలు, నోటు బుక్కులు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. వారి వెంట హెచ్ఎం రామచంద్రారెడ్డి, నాయకులు సురేశ్ పాల్గొన్నారు.

నోముల పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్న జడ్పీ సీఈవో

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించిన ఉపాధ్యాయులు

షాబాద్, జూన్ 14: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని షాబాద్ ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో శంకర్‌రాథోడ్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్, షాబాద్ ప్రాథమిక పాఠశాలల్లో అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొని చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మండల నోడల్ ఆఫీసర్ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ కొత్త పాండురంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, విజయశ్రీ, శ్రీశైలం, విద్యార్థులు పాల్గొన్నారు.

షాబాద్ : సీతారాంపూర్‌లో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీటీసీ చెన్నయ్య, మండల నోడల్ ఆఫీసర్ లక్ష్మణ్

షాబాద్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీడీవో అపర్ణ

తంగడిపల్లి పాఠశాలలో అక్షరాభ్యాసం

చేవెళ్లరూరల్ : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తంగడిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించి అక్షరాస్యతకు పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.గోపాల్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, ఉపాధ్యాయులు, ఏఏపీసీ చైర్మన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండల పరిధిలోని ఎస్‌బీపల్లిలో శుక్రవారం జరిగిన బడిబాట కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్, ఎమ్మె బాల్‌రాజు, సుధాకర్‌రెడ్డి, కుమ్మరిగూడెం శ్రీశైలం, మన్నె దేవేందర్, వజ్ర లింగం, ప్రవీణ్, లక్ష్మారెడ్డి, అంబటి శ్రీశైలం పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల : మంచాల ప్రాథమిక పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. విద్యార్థులతో మంచాల జడ్పీటీసీ మర్రి నిత్య అక్షరాలను దిద్దించారు. కార్యక్రమంలో ఎంపీవో తేజ్‌సింగ్, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు బాల్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, ఝాన్సీ, సీఆర్‌పీలు జగదీశ్, గిరీశ్ పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్ : విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తూరు: విద్యార్థులతో అక్షరాలు దిద్దిస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, జూన్ 14: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ దవాఖానలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. 18సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా డీఎల్‌వో డాక్టర్ అరుణ, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ స్వర్ణ కుమారి, జిల్లా ఇన్‌చార్జి, మాస్ మీడియా ఆఫీసర్ శ్రీనివాస్, షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి మాధవి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, అప్తాల్మిక్ ఆఫీసర్ శ్రీహరి, వైద్య సిబ్బంది ఉదయ్, అన్వర్, ల్యాబ్ టెక్నీషియన్ అరుణ్, సంపత్, మల్లేష్, గౌస్, స్టాఫ్ నర్సు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

రాజు (ఫైల్)

కడ్తాల్, జూన్ 14: యువకుడు అదృశ్యమైన ఘటన కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన కేశమోని రాజు (23), హయత్‌నగర్‌కు చెందిన తరండ్ల మీనాను మూడేండ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకోగా, వీరికి సంతానం లేరు. కొన్ని రోజులుగా దంపతులిద్దరూ బతుకుదెరువు కోసం కడ్తాల్ మండల కేంద్రంలోని ఓ అద్దె రూంలో నివాసముంటున్నారు. ఈ నెల 9వ రాత్రి సరుకుల కోసం షాప్‌కి వెళ్లి వస్తానని మీనా భర్తతో చెప్పి వెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి రాజు ఇంట్లో కనిపించలేదు. భర్త ఆచూకీ కోసం చుట్టు పక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంట్లో ఉన్న నగదుతోపాటు, విలువైన వస్తువులను రాజు తీసుకెళ్లాడని మీనా శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెంజర్లలో యువతి..

మౌనిక (ఫైల్)

కొత్తూరు : ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. కొత్తూరు ఎస్ఐ కే శ్రీనివాస్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెంజర్లకు చెందిన దేశాల భీమయ్య కూతురు మౌనిక (19) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటూ టైలరింగ్ చేస్తుంది. ఈ నెల 13న జ్వరంగా ఉందని దవాఖానకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇండ్లలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మౌనిక తండ్రి దేశాల భీమయ్య ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ నర్సింహారావు తెలిపారు.

నేడు కల్యాణలక్ష్మి

చెక్కుల పంపిణీ

ఇబ్రహీంపట్నం, జూన్ 14 : ఇబ్రహీంపట్నం మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సునిత తెలిపారు. ఉదయం 10గంటలకు క్యాంపు కార్యాలయంలో కార్యక్రమం ఉన్నందున లబ్ధిదారులంతా సకాలంలో చేరుకోవాలన్నారు. అదే విధంగా ఉదయం 11:30 గంటలకు అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని శివగార్డెన్‌లో చెక్కులను అందజేయనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే యాదయ్యకు ఘన స్వాగతం

శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఎమ్మెల్యే కాలె యాదయ్యకు ఘనంగా స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు - చేవెళ్ల రూరల్

సమస్యలను పరిష్కరించండి

ఎంపీ మల్లు రవికి వినతిపత్రం అందజేస్తున్న వివిధ గ్రామాల సంఘం అధ్యక్షులు

కడ్తాల్, జూన్ 14: పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవిని, కడ్తాల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలను విన్నవించారు. విజయ డెయిరీలో పాలు పోసే రైతులకు రెండు నెలలుగా పాల బిల్లులు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులతో ఎంపీ మాట్లాడినట్లు వారు తెలిపారు. అదే విధంగా లాలాపేట్‌లోని విజయ డెయిరీ ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్ మల్లయ్యని కలిసి సమస్యలను విన్నవించారు. వినతిపత్రాలు అందించిన కడ్తాల్, కొండ్రిగానిబోడుతండా, నిడదవెల్లి, విఠాయిపల్లి, చంద్రధన, పాల సొసైటీ అధ్యక్షుడు చేగూరి వెంకటేశ్, సభావట్ బిచ్చానాయక్, రంగయ్య, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పాడి రైతులు బాచిరెడ్డి రవీందర్‌రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్యకు సత్కారం

తుర్కయంజాల్,జూన్ 14: రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్) వైస్ చైర్మన్‌గా ఎంపికైన కొత్తకర్మ సత్తయ్యను శుక్రవారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం పాలకవర్గం సభ్యులు సంఘం కార్యాలయంలో సత్తయ్యను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా రైతు బంధు సమితి మాజీ చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తుర్కయాంజాల్ రైతుసేవా సహకార సంఘం చైర్మన్‌స్థాయి నుంచి టెస్కాబ్ వైస్ చైర్మన్‌గా కొత్త కుర్మ సత్తయ్య ఎంపిక కావడం గర్వించదగిన విషయం అన్నారు. కార్యక్రమంలో తుర్కయాంజాల్ రైతుసేవా సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భర్తపై దాడి చేసిన భార్య, కుమారుడు

కడ్తాల్, (తలకొండపల్లి), జూన్ 14: భార్య, కుమారుడి దాడిలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెంది ఘటన తలకొండపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండల పరిధిలోని తుమ్మలకుంట తండాకు చెందిన మూడవత్ పాండు (45) భార్య శాంతి, కుమారుడు శ్రీహరితో కలిసి తండాలో ఉంటున్నారు. కొన్ని రోజులుగా కుటుంబంలో తరుచూ గొడవలు జరుగుతుండగా, బుధవారం రాత్రి గొడవ జరుగుతుండగా, పాండుపై భార్య, తనయుడు కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పాండుని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అనంతరం బాధితుడిని మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, హత్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కడ్తాల్, జూన్ 14: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యవంతంగా ఉండవచ్చని ఎంపీడీవో సుజాత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల పంచాయతీ అధికారి మధుసూదనచారితో కలిసి ఆమె పర్యటించారు. కాలనీల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదని సూచించారు. గ్రామాలు, తండాల్లో పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలన్నారు. తడి, పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

మండల కేంద్రంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సుజాత

నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలి

షాద్‌నగర్‌టౌన్, జూన్ 14: పిల్లలందరికీ తప్పకుండా నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి అన్నారు. డివిజన్ స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం అనంతరం నులిపురుగుల నివారణ మాత్రలను వేయించాలన్నారు. షాద్‌నగర్ డివిజన్‌లో 1-19సంవత్సరాలోని పిల్లలు 85,776మంది ఉన్నారని, వారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ శ్రీహరి, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

మైనార్టీ కార్పొరేషన్‌కు నిధులు అందించాలి

కడ్తాల్ : మైనార్టీలకు అందించే కార్పొరేషన్ నిధులను డీసీసీబీ ద్వారా అందించాలని డీసీసీబీ డైరెక్టర్లు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హజ్ ప్రధాన కార్యాలయంలో నియామకమైన రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఒబేదుల్లా కొత్వాల్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన డీసీసీబీ డైరెక్టర్లు వెంకటేశ్ గుప్తా, విష్ణువర్ధన్‌రెడ్డి, రంగారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. మైనార్టీల అభ్యున్నతికి అందించే నిధులను డీసీసీబీ ద్వారా అందించే విధంగా చూడాలని ఆయనకి డైరెక్టర్లు వినతిపత్రం అందజేశారు.

ఒబేదుల్లా కొత్వాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్లు

తంగడిపల్లిలో వ్యక్తి దారుణ హత్య

మామను కత్తితో నరికి చంపిన మేనల్లుడు

డబ్బు తగాదాలే హత్యకు కారణం..?

చేవెళ్లరూరల్, జూన్ 14 : వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని తంగడిపల్లి గ్రామానికి చెందిన రుల్లా ఖాన్(58) భార్యా పిల్లలతో కలిసి నగరంలో నివాసం ఉండేవాడు. రెండు సంవత్సరాల క్రితం రుల్లా ఖాన్ ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో సొంత గ్రామానికి వచ్చి ఉంటున్నాడు. ఆరోగ్యం కుదుటపడడంతో తనకున్న భూమిలో వ్యవసాయం చేస్తూ రుల్లాఖాన్ ఒంటరిగా గ్రామంలో ఉంటున్నాడు. అతడి అక్క కొడుకు ఖాజా పాషా డబ్బులు కావాలని పలుసార్లు అడగడంతో తన వద్ద లేవని మందలించాడు. కోపం పెంచుకున్న ఖజా పాషా గురువారం సాయంత్రం మేనమామను హత్య చేసేందుకు కత్తి తీసుకొని స్నేహితులు షేక్ ముస్తఫా, అష్టల్‌లను తన వెంట తీసుకుని స్కూటీపై తంగడపల్లిలోని మామ ఇంటికి వచ్చారు. రాత్రి రెండు గంటల సమయంలో మామ అల్లుళ్ల మధ్య వాగ్వాదం జరుగడంతో కత్తితో రుల్లాఖాన్‌పై దాడి చేసి హత్య చేశాడు. గ్రామస్తులు గమనించి వెంబడించడంతో ముగ్గురు పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య జాకీయబేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల ఆగడాలను అడ్డుకోవాలి

చేవెళ్లటౌన్, జూన్ 14: ఫీజుల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వేధిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు, చేవెళ్ల నగర కార్యదర్శి మహిపాల్ అన్నారు. శుక్రవారం ఫీజుల కోసం విద్యార్థులను వారి తల్లిదండ్రులను వేధిస్తున్న ప్రైవేట్ పాఠశాలల తీరుపై చేవెళ్ల మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో అధికారులకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు ఫిర్యాదు చేసి వినతి పత్రం అందజేశారు. వారి వెంట ప్రశాంత్, ఉదయ్, శివ, విద్యార్థులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

మొయినాబాద్, జూన్ 14 : పంచాయతీ కార్మికులకు వేతనాలు లేక మూడు నెలల నుంచి పస్తులుండే పరిస్థితి నెలకొన్నదని సీఐటీయూ జిల్లా నాయకుడు ముంజగల్ల రత్నం అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలల నుంచి వేతనాలు లేవని, వెంటనే వేతనాలు మంజూరు చేయించాలని శుక్రవారం ఎంపీడీవో సంధ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ మాసం రావడంతో పిల్లలకు స్కూల్ ఫీజులు కట్టుకోవడానికి కూడా చాలా ఇబ్బంది ఉందని చెప్పారు. కార్మికులకు వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వీరితో పాటు వెంకటేశ్, ప్రమీల, చంద్రమ్మ, అనిత ఉన్నారు.

కళాశాలలో ప్రవేశాలకు

దరఖాస్తు చేసుకోండి

షాద్‌నగర్‌టౌన్, జూన్ 14: షాద్‌నగర్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల 2024-2025 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ నీతా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్ల దరఖాస్తులను ఈ నెల 17నుంచి నుంచి 23వ రకు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ఎస్టీ విద్యార్థినులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7093551966, 9705530720లను సంప్రదించాలని కోరారు.

గురుకుల బాలికల విద్యాలయంలో..

మంచాల : మంచాల మండలం రంగాపూర్ సమీపంలో ఉన్న గిరిజన సంక్షేమ మినీ గురుకుల బాలికల విద్యాయలయంలో ఒకటవ తరగతిలో 30సీట్ల ఉన్నందున బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జే లీలావతి శుక్రవారం ఒక్క ప్రకటనలో తెలిపారు. ఈనెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ల్యాటరీ పద్ధతిలో 24న ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల బాలికలు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

టెండర్లకు ఆహ్వానం

చేవెళ్ల రూరల్, జూన్ 14 : చేవెళ్ల మండల పరిధి గొల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బండారి శ్రీనివాస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజెస్ నావాబ్‌పేటలో 2024-25 సంవత్సరానికి గాను కిరాణ సరుకులు, పండ్లు, కూరగాయలు, గుడ్లు, చికెన్, మటన్, క్యాటరింగ్, బార్బర్ల కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కిరాణా సరుకులైతే రూ.2000, కూరగాయలు, పండ్లు, గుడ్లు, చికెన్, మటన్, క్యాటరింగ్ అయితే రూ.1000, బార్బర్‌కు రూ.500 చొప్పున ప్రిన్సిపాల్ ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ (బాయ్స్) గొల్లపల్లి పేరు మీద డీడీ తీసుకొని వచ్చి టెండర్ ఫారాలను పొందవచ్చునని తెలిపారు. దరఖాస్తు చేయుటకు 21 తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. 24న వికారాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సమక్షంలో టెండర్లు కేటాయిస్తామని తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 7989649926లో సంప్రదించాలని కోరారు.

గొర్రెల యజమానులు

అప్రమత్తంగా ఉండాలి

యాచారం, జూన్14: గొర్రెల మందల వద్ద రాత్రిపూట పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తు తెలియని దొంగలు కాపరులను బెదిరించి గొర్రెలను అపహరించుకుపోతున్నారని పేర్కొన్నారు. ఇటీవలే కందుకూరు మండలం ఆకులమైలారంలో గొర్రెల మంద నుంచి గొర్రెలను దొంగలించినట్లు తెలిపారు. గొర్రెల యజమానులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.